కథా నిలయం
2021
శ్రీకాకుళం

# తియ్యటి తీగెలు

ఆనాడు అరుణ నిద్రలేచింది మొదలు ఏదో హడావుడి, తొందర.

ఎంత చేసినా యింటి పని తరగక యింకా చేయవలసింది చాలా మిగిలివున్నట్లు కన్పిస్తూ తన సహనాన్ని పరీక్షించసాగింది. పుండు మీద కారం చల్లినట్లు ఆనాడు పనిమనిషి కూడా ఎగవేసినట్లుంది. ఇంకేం? అరుణ టెంపరేచర్ దాదాపు జ్వరస్థాయికి చేరింది.

'ఛీ! పాడు చాకిరి, ఆడదై పుట్టేకన్నా అడవిలో చెట్టై, పుట్టలో మట్టై, తలుపుకు గొళ్లెమై పుడ్తూ బ్రతకడం మేలు. వేళకు ఈనాడు పనిమనిషి కూడా వచ్చి తగలడక, నాకీ అదనపు చాకిరీని అంటగట్టేంది. దానికేం? మహారాజు! ఆఁ ఏవన్నాను. 'మహారాజనా? అవును! అంటాను, అనకేం చేస్తాను. దాస్యానికి అలవాటుపడ్డ ఈ పాడుబుద్ధి ఎక్కడకు పోతుంది? చాటు వుకో, సామ్యానికో అయినా! సరే! వుపమాన, రూపకాది అలంకరాలను ఆసరాగా తీసుకుని పుంలింగానికి పెద్దపీట వేస్తూ, పురుషాధిక్యానికి చెరగని ముద్ర వేసి చెలామణిలోవుంచాల్సిందే! కాక పోతే ఏమిటీ? పోలికకోసం 'మహారాజు' శబ్దానికి బదులు 'మహారాణి' అంటూ ప్రయోగించి వుండవచ్చుగా? అలా చేయలేదు. ఎందుకు చేస్తాను?' అంటూ చీకాకుపడ్తూ వెంటనే రాజీ కుదుర్చుకున్నట్లు.

'ఏదో ఒకటి రాజో? రాణో? అది ఎవరైనా నాకన్నా వందరెట్లు నయం. ఈ తర్కవితర్కాలుంటే చాలు, నా మెదడు అట్టే జాగరూకమై గభాలున మేల్కొన్న తెలివితో సలహాలకు తారసిల్లుతూంది' అని చీదరించుకుంటూ వో మారు గడియారం వంక చూచింది. గడియారంలో పెద్ద ముల్ల పదిని తాకుతూ టంగు మంటూ శబ్దించింది. ఆ గంట తన ఆత్రానికి మరింత ఆత్రం కల్పిస్తూ వుంటే 'అమ్మో! అప్పుడే పదై పోయింది. పాడు గడియారం, దీనికి నిద్ర అంటూ లేదు. పొద్దస్తమానం కంట్లో వత్తేసుకుని కుమ్మరి సారెలా తిరుగుతూ వుంటుంది' అని చిరచిర లాడుతూ వెంటనే పొరపాటును గ్రహించిన, దిద్దుబాటుతో నవ్వుకుంటూ 'నిజానికి ఈనాడు నా బుద్ధికి పూర్తిగా విడాకులిచ్చినట్లున్నాను. కాకపోతే ఈ గడియారం మీద నాకీ కసి ఎందుకు? అదేం ప్రాణవంతమైన జీవి గనుకనా? ఆలోచించేందుకు? కాక స్వయంప్రతిపత్తి కలిగిన సచేతన పదార్థమా? కేవలం అది మేధావి

మలచిన కీలుబొమ్మ. ఉత్త బిస యంత్రం! దాన్ని ఏమని ఏం లాభం? అనవలసి వస్తే కాలాన్ని నిలదీయాలి;

అమ్మో! మా బాసు అవులిస్తే పేగులు లెక్కించే బాబతు. చూడ్డానికి బక్క పలుచగా, యింతలేసి కళ్లతో నాజూగ్గా పిల్లవాడిలా కనిపించినా వుక్కు పిండం ఆయన మా ఆఫీసులో తొలిసారి ప్రవేశించినప్పుడు మేమంతా 'వుత్తకచ్చికాయ బచ్చా' అనుకున్నాం. మా హెడ్క్లర్కు గోపీనాథంగారు బాసును జేబులో పెట్టుకుని సరాసరి గోటికాయలా ఆడుకుంటాననుకున్నాడు.

మరి మా స్టెనో మిస్ రోజారియో మినీ స్కర్టు కల్చర్తో, బి పౌడర్డు బి డెక్డ్ అప్పీల్ తో బాసును బొంగరంలా తిప్పుకుంటాననుకుంది. మా అటెండర్ మురళి టి కప్పుల్తో తుఫాన్ సృష్టిస్తాననుకున్నాడు. తక్కిన స్టాఫ్ అంతా గొప్ప క్రికెట్ ఆటగాళ్లై బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ బాసును బంతిలా వాడుకుందామనుకున్నారు. అవసరాల కోసం ఆశ్రయిస్తూ ఈ గల్లా ముసురుకునే చిన్నా పెద్దా జనం అంతా నజరానాలు పొదిగిన జాదూ తివాచీ పరిచి సిగ్నేచర్ల పర్వంలో సొంత పబ్బం గడుపుకుందామనుకున్నారు. పాపం!

ఇవన్నీ, వారం తిరక్కుండానే తలకిందులు చేస్తూ విశ్వరూపిలా అన్ని పనులూ ఒక్కడే చక్కబెట్టి ఎవరి స్థానాన్ని వాళ్లకు చూపుతూ కట్టుదిట్టం చేశాడు గడుసు పిండం. మనిషి చేవకన్నా గుండె చేవగట్టిది. ఇక్కడ మళ్లా నేను మీమాంసలో చిక్కి శరీర ప్రాణాలను గూర్చీ, మనోబుద్ధి అహంకారాలను గూర్చి ఆలోచిస్తూ మనిషినీ - గుండెను వేరు చేస్తూ కూర్చున్నానంటే 'గోవిందాయ మంగళం' నా పని. బల్లి తాను అల్లుకున్న గూటిలో తానే చిక్కుకు చచ్చినట్లు, నావక్ర బుద్ధి నామాట వినక పయనిస్తూ పరుగులు తీస్తుంది. ఇప్పటికే ఆలస్యం అయింది. పదకొండు గంటలకు రేడియోలో రికార్డింగ్ వుంది. ఆఫీసుకు వెళ్లక ముందే ఆకాశవాణికి వెళ్లి ఆ ప్రసంగం ఏదో పూర్తి కానిచ్చి, ఆ తరువాతే ఆఫీసుకు వెళ్తే మంచిదంటూ నిర్ణయించుకుంది.

ఈ నిర్ణయం తరువాత అరుణ మనస్సుకు చాంచల్యం వదిలి ఏకాగ్రత కుదిరినట్టుంది. వో అరగంటలో స్నానం అదీ పూర్తి చేసుకుని, తలుపులూ తాళాలు సరిగ్గా చూసుకొని పరుగు వంటి నడకతో బస్సు స్టాండుకు బయలు దేరింది.

బస్సులకేం ? వెంట వెంటనే వస్తున్నాయి. అయితే ఖాళీ ఎక్కడా లేదు. ఎక్కేవాళ్లే తప్ప దిగే వాళ్లెవ్వరూ లేరు. మగపిల్లలు ప్రాణాలతో చెలగాటం ఆడుతూ ఫుట్బోర్డు పై నిలబడి రాడ్ పట్టుకు గబ్బిలాల్లా వ్రేలాడుతున్నారు. ఒకడి చేయి మరొకడికి ఆసరాగా నిల్చున్నారు. ఏ ఒక్క చేయి పట్టు దప్పి జారినా దాదాపు అరడజను ప్రాణాలు 'హరీ' మంటాయి. ఇండియాలో జనాభాకేం తక్కువ? చస్తే చస్తారు. బేరోజ్గార్ బ్రతుకులు. అంటూ మనలో కొందరం సర్దుకోవచ్చు, కానీ ఆ మాట తల్లికి చెప్పి చూడండి ఏమంటుందో? ఆ హృదయం ఎంత ఘోషిస్తుందో? ఆమె కార్చే కన్నీరు వరదలై పారుతూ మన హృదయ పాషాణాలను కడిగి కరిగిస్తూ తన వెంట కొనిపోతుంది.

సరే! యిలా ఎంత సేపనివేచి వుంటుంది పాపం. ఈ సారి అరుణ అట్టే కాలయాపన చేయకుండా నిర్ణయాలను వెంటవెంటనే తీసుకోవటం ప్రారంభించింది.

బస్సు ప్రయాణానికి 'స్వస్తి' చెప్పి ఆటో కోసం ప్రయత్నించింది. అటూ, ఇటూ రెండు వైపులా చూస్తూ ఆటో! ఆటో! అంటూ చప్పట్లు చరుస్తూ కేకలు పెట్టింది. అరుణ పిలిచే పిలుపు ఆటో హోరులో కలిసి పోయిందే తప్ప ఏ ఆటోనం నిలువరింపచేయలేదు. అన్ని ఆటోలు భర్‌పూర్‌గా, ఫుల్ స్పీడ్‌లో పోతున్నాయి. ఒకటీ, రెండు, మూడు దాదాపు పది ఆటోలు వెళ్లిపోయాయి. టైము పదిన్నర దాటింది.

అరుణ పాపం దీనంగా వాహన సౌకర్యం కోసం ఎదురు తెన్నులు కాస్తూ నిలబడి పోయింది. ఇంతలో ఖాళీగా వున్న వో రిక్షా కనిపించింది. కనిపిస్తే ఏం లాభం? పోయి పోయి ఈ రిక్షా ఎక్కి, రేడియో స్టేషన్‌కు వెళ్లితే ఆ కాపలా చౌకీదారు కూడా నన్ను అటకాయించి, లోపలికి వెళ్లనివ్వడేమో? అంటూ, వో నిమిషం అటూ ఇటూ తటపటాయించింది, చివరకు ఏదైతేనేం? అవసరానికి అందిందే ముఖ్యం. ఈ అవకాశం చేయిజారితే మరో మార్గం కనిపించడం లేదు. అందుకే దక్కిన అవకాశాన్ని వుపయోగించుకోవటంలోనే వివేకం వుందన్నారు పెద్దలు. అంటూ సైకిల్ రిక్షాను ఆపి, ఎక్కి కూర్చుని రేడియో స్టేషన్‌కు వేగంగా పోనియ్యి అంటూ చెప్పింది.

రిక్షా తొక్కుతున్నవాడు, ఇరవై ఏళ్ల ప్రాయపు వాడై వుండవచ్చు. ఆరోగ్యమైన శరీరంతో కళకళాడుతున్నాడు. తలకు తువ్వాలు గుడ్డను పాగాలా చుట్టుకొన్నాడు. రిక్షామంచి వేగంలో పోతూవుంది. కనుచూపు మేరలో రేడియో స్టేషన్ వుంది. పర్వాలేదు. దాదాపు ఆటో స్పీడుతో చేరుకుంటుందనుకుంది అరుణ. వో మారు ఆ 'టాక్' ఏదో చూసుకుంటానని పేపర్లు తీసి లోలోపల కళ్లతో గబాగబా చదువుకు పోతుంది.

ఇంతలో రిక్షా, తాను చేరవలసిన గమ్యానికన్నా వేరైన మరో మలుపు తిరిగింది. అది గమనించిన అరుణ కంగారుగా 'అదేమిటి నాయనా? మనం వెళ్లవలసిన ఆకాశవాణి స్టేషన్ కుడివైపున వుంటే నీవు ఎడమవైపుకు బయల్దేరావ్? తెలియకపోతే నన్నడుగొచ్చుగా? అంది.

'రేడియో స్టేషన్ నాకు తెల్వకపోదులెండి? అన్నీ తెలుసు' అన్నాడు రిక్షావాడు.

'అంత తెలిసిన వాడివైతే? దగ్గరి త్రోవ వదలి వంకర సందులు తిరుగుతూ దూరాన్ని మరింత పెంచడం దేనికీ?

'దూరం దగ్గర మీకెందుకమ్మా? రేడియో స్టేషన్ కంట కిరాయి కుదిర్చుకున్నారు. ఆడ దించినంకనే నాకిరాయి నాకియ్యండి. సుట్టూ గల్లీలు గల్లీలు దిప్పి దూరం ఎక్కువైందని జ్యాదా కిరాయి అడగను. భయపడకుండి' అన్నాడు.

'ఓహో? బాగా ఆరితేరిన వాడిలా వున్నావ్, చూడూ! నేనేం ఈ రోజే పల్లెటూరి నుండి వచ్చి పట్నం చేరలేదు. నిన్ను చూసి భయపడ్డానికి, నీవింకా దారి తప్పిస్తూ అధిక ప్రసంగం చేశావంటే పోలీసులకిస్తాను. జాగ్రత్త' అంటూ కళ్లెర్ర జేసింది.

అది గమనించిన రిక్షావాడు.

'ఏందమ్మో? గుడ్లెర్ర జేసి నన్ను బెదిరిస్తుండవూ? నేనేం తప్పు జేసిన్నని నన్ను గదుమాయించి మాట్లాడుతుండవ్? నీవు పల్లెటూరి మనిషివి ఎట్లైతవు అమ్మ? చేతుల సంచి పట్టి ఒంటిగ రేడియో ఇస్టేషన్ కంట బయల్దేరినప్పుడే తెల్సిపోయె రంగు. నీవు పల్లె గొంపల్నుండి రాలేదు. భాగ సదువుకున్న పట్నం మనిషివంట తెల్వదా? ఏంది? ఇంతకు యా తోవ ఐతే నీకేంది? నిన్ను అనుకున్నకాడికి ఒక్క పైస ఎక్కువ కోషీష్ సేయకుండ తీస్కపోతె సరిపాయెగదా?

'అరె నాయినా? ఇక్కడ పైసలలెక్క గాదురా! బాబు. ముందే ఆలస్యం అయితుందని నేనేడ్చిచస్తూ వుంటే, యింకా యీ మలుపులన్నీ తిప్పుతూ ఎందుకు చంపుతావూ అని - ఇంతకూ నా బుద్ధి తక్కువ కాకపోతే? పోయి పోయి ఈ ముదనష్టపు రిక్షా ఎందుకెక్కాలి? నా ఖర్మకాలి ఎక్కితే ఎక్కాను? ఈ డొంక తిరుగుళ్ల ప్రయాణం దేనికీ? నీకు పుణ్యం వుంటుంది. దగ్గరి త్రోవ వెంట తీసుకెళ్లు. కావాలంటే మరో రెండు రూపాయలు అదనంగా తీసుకో' అంటూ దాదాపు అర్థిస్తున్నట్లు మాట్లాడింది.

' ఓ అమ్మా! నీవు ఎవరో గాని చాలా బండాళం వున్న మనిషి తీర్గనే కండ్ల వడ్తుండవ్. అంత కలిగిన దానివి ఈ సైకిల్ రిక్షా ఎక్కుడు ఎందుకు? నీ హోదాకు తగినట్లు ఏ ఆటోనో టాక్సీ గాడీనో కుదిరిచ్చుకోని ఎక్కక పోయినవా? నీవు రొండు రూపాయలుగాదు రొండు వందలు యిచ్చినా సరే. నేను మట్టుకు ఆ దిక్కుకెళ్లి రిక్షా తొక్కుకుంటూ పోను' అన్నాడు.

' ఏం ? ఎందుకు వెళ్లవ్? అక్కడేం దయ్యాలు, భూతాలు ఉండి నిన్ను పీక్కు తింటాయా? కాక ఎవరో దారి కాచి పట్టపగలు నీ మీదపడి నిన్ను దోచుకుని చంపుతాడా?'

'అమ్మో అమ్మో! జర ఆగు తల్లి! నాకెందుకుంటరమ్మ పగోళ్లు? నేనేం లక్పతినా? కాకుంటే రాజకీయపోళ్ల పార్టీలల్ల వున్ననా? లేకపోతే గుండగాళ్లల్ల షరీకు వుండగన్కనా ? ఎవరు నన్ను జంపుతారు? నాకెందుకు భయం? నా మెళ్ల జబర్దస్తు అల్లా తావీజ్ వుండది. అది జూస్తే దయ్యం, భూతం, గాలీగీలీ ఏదీ నా దగ్గరకు రాదు. ఎర్కేనా?

'మరి ఏ భయం లేని వాడివి యింత చుట్టు తిరుగుతూ నన్ను యిబ్బంది పెడ్తానంటుండావెందుకు? అంటూ నిలదీసింది.

' ఎందుకా? ఆడ నా పెళ్లాం వుంది.........' అంటూ అన్నాడో లేదో అరుణకు అరికాలి మంట నెత్తికెక్కింది. తోక తొక్కిన నల్లత్రాచులా లేస్తూ దెబ్బ తిన్న అహంతో ' ఏరా? నీకళ్లు తిరుగుతున్నాయా? నోటికి వచ్చినట్లు కూస్తున్నావ్. ఆ నోరు కాస్త సంభాళించుకో? ఏ వూరు నీది? ఎక్కడినించి వచ్చావ్?' అంటూ నిప్పులు చెరుగుతున్న అరుణ కోపం చూసిన రిక్షావాడు ఆమె తనను అపార్థం చేసుకున్నట్లు గ్రహించి ఎంతో మర్యాదగా అమెను వుద్దేశిస్తూ...

'ఓ అమ్మా? జర తమాయించుకో, నా మాట యినిపించుకో. వుత్త పుణ్యానికి నన్ను తప్పు పట్టుకుంట ఏందేందో అంటుండవ్. నీవు ఏమన్నా, ఎన్ని అన్నా నేను బేఖుబార్ ఉండ, అసల్‌కు, నీవే ఏందో పెద్ద భయంల చిక్కినట్లుండవు. అందుకే నన్ను మినట్ మినట్ కు అనుమానిస్తుండవ్. ఆఁ యిందాక నా వూరు యాది అంట అడ్గితివి గదా? యిను! నా వూరు యిక్కణ్ణే పటన్‌చెఱువు పక్కవూరు. నేనూ సదువుకున్నోణ్ణే. రిక్ష తొక్కుతుండనని తక్వ సూడకు. లేదు లేదనుకుంట నల్గుర్ని బిచ్చం అడుక్కుం యిష్టం లేక రెక్కల కష్టం చేసి రూం రెంటుకూ, తిండికి సరిపడ సంపాదించుకుంట డిగ్రీకి తయారైతుండ గుర్తుంచుకో' అన్నాడు.

ఈ మాట విన్న అరుణ యింకాసందేహిస్తూ..

చూడు నాయనా! నీ పేరేదో? కాని నిజంగా నీవు డిగ్రీ చదివే వాడివే అయితే యిప్పుడు ఫ్రీషిప్పులకు, స్కాలరు షిప్పులకు ఏం తక్కువని? నీకు రిషా లాగి చదువు కోవలసిన గ్రహచారం పట్టింది? వుత్తగా బుకాయించకు.

'మాడమ్! మాటలు సక్కగా రాని. ఇందాకటి నించి సూస్తుండ. తొల్త నిన్ను సదువుకున్న దానివి అనుకున్న గని, నీ మాటలు జూస్తె. అట్ల అనిపిస్తలేదు. నీవు జెప్పిన ఇస్కాలరుషిప్పులు అందరికి యిస్తుండరా? అవన్ని తిర్గతోడిచ్చి, ముందే కడ్పుగాలిన నన్ను మరింత వుడికిచ్చి తప్పుతోవ తొక్కించకు. నీ తోటి సవాలుకు జవాబు అంట గూసుంటె అవతల నా కిరాయి గంట గొడ్తది. నేను అయిదు నిమిషాలు అటూ యిటూ ఈ తోవ ఎంటనే తోల్కపోత, గని నీవు జెప్పిన దారి ఎంట మట్కు రిక్షా తొక్కుకుంట రాను. నీ యిష్టం వుంటే కూసో, లేకుంటే దిగు, యిందాక నిన్ను తోల్కొచ్చిన పైసలు గూడ అడ్గను' అంటూ టక్కున రిక్ష అపుతూ, ఆఁ నాపేరు అడ్గితివి గద! నా పేరు రహీం' అంటూ చెప్పాడు.

అరుణ అప్పుడు ఎటూ తేల్చుకోలేని స్థితిలో వో రెండు నిమిషాలు వుండి చివరకు వో నిర్ణయానికి వచ్చి 'సరే! అయిన ఆలస్యం ఎలాగూ అయిపోయింది. యిప్పుడింక రేడియో స్టేషన్‌కు వద్దు. ఇక్కడికి వో మైలు దూరంలో వుండే మా ఆఫీసుకు తీసుకువెళ్ళి అక్కడినుండి ఫోన్ చేసి రికార్డింగ్ రేపు అయిదు గంటలకి మార్చుమంటూ రిక్వెస్టు' చేస్తాను. అంటూ రిక్షాలో స్థిమితంగా కూర్చుంది.

'అమ్మా! నీ పేరేందో గని నీ హోదాకు తక్కువ అనుకోకుంటే నీ పేరు చెప్పు. నన్ను నీ తమ్ముడనుకో అన్నాడు రహీం.

అరుణకు యింకా రహీం సమాధానంతో పూర్తిగా నమ్మకం కుదిరి సందేహం తీరినట్లు లేదు. అయినా వాడి విషయం తెలుసుకుందామంటూ 'రహీం! నా పేరు అరుణ, ఇంతకూ నీకు పెళ్ళైందా? అయితే మరి నీ భార్య అక్కడ వుండటానికీ నీవు ఆ దారి వెంట రిక్షా తొక్కక పోవటాని కీ ఏమిటీ సంబంధం! అంటూ ప్రశ్నించింది.

'అరుణ మ్యాడమ్! నేను డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో వుండగా నా పెళ్లి నిశ్చయమైంది. ఇంతట్లోకే నా ఫాదర్ పోయిండు. మా అన్న దుబాయికి పోతానని నడుమ దలాలుకు పైసలు కడ్తే, వాడు మోసం చేసి భాయిసాబ్‌ను బొంబాయిలో దింపి పత్తా లేకుండా వుడాయించిండు. మా అన్న, పరేషానై కొత్తగా బొంబాయిల తిర్గుతుంటే యాక్సిడెంటైంది. కుడిచెయ్యి పప్పు పప్పు అయింది. సంగతి తెల్సుకొని మేం బొంబాయికి పోయి మా అమ్మ మెహర్ సొమ్ము పెట్టి ఎన్నెన్నో తంటాలు పడి దవాఖానా ఖర్చులు, మందుల ఖర్చులూ భరించి మా అన్నను బతికించుకున్నాం. మా అన్నకు యిద్దరు పిల్లలు. మరీ పసిగుడ్లు. చిన్నోడు యింకా పాలపండ్లు రానోడు. మా అమ్మకు ఘోషా. మా అన్న బేకారు. నా ఒక్కణి సదువుకోసం మా అమ్మ మా వదినె బేపర్దా ఐ బయటికి బోయి కార్ఖానా పని చేయాలి. అట్ల మాకు యిష్టంలేదు. వాళ్లిద్దరు యింట్లనే వుండుకుంట చట్నీలు పెట్టి, కుట్లు కుట్టి సొసైటికి యిస్తరు. కాని ఆ సంపాదనతోటి యిల్లు గడువదు. అందుకోసం నేను రెగ్యులర్ యిస్టూడెంట్‌గ కాలేజ్ సదువు బందుజేసి, దినం పూట దొరికిన పనులు జేస్తుండ. నాకు వైరింగ్, ఆటోరిపేరింగ్ పనులు గూడ వొస్తవి, గని అవి ఎప్పుడూ దొర్కవు గద? ఆ రిపేరింగ్ పనిలేక, రికాముగ వున్నప్పుడు ఈ రిక్షా దొక్కుత. ఒక యాడాది అదే వన్ యియర్ కష్టపడ్తే అల్లాకే ఫజల్‌సే నాకు డిగ్రీ దొర్కుతది. మా కష్టాలు బలాదూర్ అంటపోతయి'' అన్నాడు.

ఇంత విన్నా అరుణ ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. మళ్లా అరుణే కలుగజేసుకుంటూ సందేహం తీరనట్లు -

' ఇదంతా సరేనయ్యా! ఈ వైపునుండి రిక్షా తొక్కనంటుండావ్? దేనికి?' అంటూ ప్రశ్నించింది.

ఆ ప్రశ్న విని చిరాక్‌గా రహీం -

'అయ్యో మాడమ్! గీమాత్రం సైకాలజీ తెల్వకపోతె ఎట్లా? ఆడ నాఅత్తగారిల్లు వుండది అంట చెప్పినప్పుడే నీవు సముజాయించుకోవల్సి వుండె. అసొంటిది వోయి మా హాసేన్ హుసేన్‌ల లడాయి అంతకథ జెప్పినంక గూడ నీవు రీజన్ అడ్గుతుండవ్? అంటె నాకు జర బాధ అయితుండది. సిస్టర్! యిది దిల్‌దార్లందరికి దెల్సిన నాజూక్ ఖిస్సా. ఈ ఖబర్లకు సదువుతోటి పని లేదు. మనస్సు- అదే నర్మీదిల్ తోటి పని వుంటది' అంటూ మధ్యలో ఏదో స్మృతిలో మెదిలినట్లు నన్ను చూస్తూ 'బహన్! యిందాక నీవు నషర్గ రేడియో స్టేషన్ పోయి ప్రోగ్రాం యియ్యాలన్నవ్. మరి నీకు మనుషులూ - వాళ్ల మనుసులూ, అవి ఎప్పుడు ఎట్లా దౌడు తీస్తయి? ఎప్పుడు ముడ్సుకుపోతయ్, దేంతోటి రియాక్ట్ అయితయి అంటు యా సంగతి తెల్వకపోతె ఏం కత రాస్తవ్? ఆ కహానిల ఏం బిగి, ఏం మజా వుంటది? మరి ఆ కత యిన్న జనం ఎట్ల పసందు చేస్తర్? అన్నాడు.

ఈ మాటలు వింటున్న అరుణకు రిక్షా తొక్కుతున్న రహీం ఒక సాధారణ కాలేజీ స్టూడెంటుగా కాక హ్యూమన్ సైకాలజీని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఒక మానసిక

తత్త్వవేత్తగా కనిపించసాగాడు. అయినా ఆమె కుతూహలంతో యింకా తన సందేహం తీరనట్లుగానే ధ్వనిస్తూ

'సరే! రహీం భాయి! వొప్పుకుంటున్నాను. నీవు చెప్పింది నిజమే! కానీ ఆ సంఘటనేదో? ప్లీజ్ చెప్తవా? అంటూ అర్థించింది.

అప్పుడు రహీం యిష్టం వుండీ లేనట్లు ప్రారంభిస్తూ -

'చూడు సిస్టర్! యిటువంటి నాజూక్ మాటలు ఖులాసాగా బయలు జేస్తే దాని నజాకత్ సచ్చిపోతది. మా ఖిస్సా మరీ రెండు ఎదల తాలూకు ఐవుండది. నీకు దెల్వదా?' అంటూ వుండగనే అరుణ అందుకుని 'పర్వాలేదు భాయి. నీ అక్కకు చెబితే తప్పులేదు. చెప్పు' అంటూ బలవంతం చేసింది.

అరుణ మాటను కాదనలేక రహీం చెప్పుకు పోతున్నాడు -

'ఆడ నా పెళ్లాం వుండది అంట నీకు చెప్తితే కోపం వొచ్చింది గద? ఆ మాట నిజం. ఆణ్ణే మా అత్తగారి యిల్లు వుండది. ఆ యింట్లనే నాకు ఖరారు అయిన పిల్ల సల్మ వుంటది. మాకు దగ్గరి రిష్తె వుంది. మా యిద్దరి మాట పలుకు ఐ, రెండేండ్లు అయింది గని యింకా నిఖా కాలేదు. యిప్పుడు మాకన్న వాళ్లు వూంచా దర్జాల వుండరు. సల్మా గుడ యింటర్ పాస్ వుండది. మా యిండ్లల్ల ఘోషా వుంటది. అందుకోసం కల్సుకునేటందుకు మోఖా దొర్కదు. అసొంటప్పుడు యాడ మోఖా దొరికిన గాని గరమ్ ఖూన్ దౌడ్ తీస్తది. సారా బదన్ హవామె వుడ్తాజాతా. దానికంటె ముందె దిల్ పరుగు దీస్తది. అటెంక రెండు కండ్లు మొహబ్బత్‌ను దీదార్ చేసేటందుకు తహతహలాడ్తయి. నీకు తెల్వంది ఏముండది సిస్టర్? అయిన గని బదులాయించిన నా ఖిస్మత్ బాగైందాక నేను సల్మాను సూడను, అంట గట్టి జేసుకున్న.

'అందుకా! ఈ దారి వెంట వెళ్లనంటున్నావ్?' అంటూ అరుణ మళ్లా ప్రశ్నించింది.

'కాదు. అరుణమ్మ కాదు! ఆ మాట తల్సుకుంటేనె నా వుడుకు నెత్తురు గడ్డ అయితది. నా కడ్పుల ఏదో చెయ్యి పెట్టి తిప్పినట్లు యికారం మొదలైతది. అయినగని యిను. మొన్న వో ఆర్నెల్ల కింద కిరాయి దొర్కితే రిక్షా చెలాయించుకుంట ఈ దిక్కునించి, యా సోయి లేకుండ పోతుండ. ఇంతల్లకె మా చిన్నసాలె సాబ్ అంటె మా సల్మ చిన్న తమ్ముడు వాడు ఎల్లిపాయె పటాక్ సిస్టర్. వాడు బజార్ల నన్ను యాడ జూసిండో? వురుక్కుంటవోయి అక్క చెవుల వూదిండు. సల్మా పాపం! నన్ను సూడాలన్న ఖాయిష్‌తోటి ఎవ్వరు గానకుండొచ్చి మూల మల్పున నిలవడ్డది. ఆ యింటి దగ్గరికి రాంగనె నా కండ్లు అనుకోకుండ ఆ దిక్కు జూసినయ్. ఇద్దరి కండ్లు గల్సినయ్. ఇంత బేహాలత్ ల నేను సల్మ కండ్లల్ల వడ్తననుకోలేదు. నేను నిల్వున కాలిపోయిన అరుణమ్మ తల్లి!' అంటూ కళ్లొత్తుకున్నాడు.

'రహీం భాయి! ఈ స్థితిలో నిన్ను చూసిన సల్మా ఏఁవన్నది?'

' ఏమీ అనలేదు అరుణా! చీదరించుకుంట 'ఛీ! పో ' అన్నగని నాకు మనస్సు అంత బాధ వుండకుండె గని రొండు కండ్లల్ల నీళ్లు నింపుకొని నన్ను చూసిన ఆ చూపు మర్వలేకపోతుండ. అట్ల వో రెప్ప పాటు జూసిందో లేదో ఎంటనే మీది దుప్పట్ట దీస్కొని నోట్ల గుక్కుకుంట వో చేత కండ్లు మూసుకున్నది. అప్పుడు నాకు ఆస్మాన్ యిర్గి నా నెత్తిన కూలినట్లు, నేనేదో దోజక్‌ల బడి కాలిపోతున్నట్లనిపిచ్చింది. ఇంత బురీ హాలత్ నా జిందగీల ఎప్పుడు ఎర్కలేదు' అంటూ వుంటే రహీంకు వోదార్పుగ 'పోనీ రహీం బాధపడకు' అన్న అరుణ మాటలు వినిపించుకోకుండా రహీం -

'కాదమ్మ! నేను శనా కటికె మనిషిని. బిల్‌కుల్ అన్నాడీతీర్గ రిక్షా తొక్కుకుంట ఎదురుపడ్డ. పాపం! జాస్మిన్ అసొంటి సల్మ, నన్ను ఆ హాలత్‌ల జూసినప్పటి ఆ కండ్లు, ఆ సూపులు నా గుండెలోతులకు దిగి పొడుస్తుంటయి. లేక లేక ఆ పిల్లను జూసి ఇచ్చే ఖుషీ కన్న దర్దే ఎక్కువ యిచ్చిన. అప్పుడు నన్ను నేను ఎంత తిట్టుకున్ననో ఖుదా గవాహై. అయినా సిస్టరు. ఆ వొక్క సెకండు కండ్లు గల్సినప్పుడు ఈ జిందగీకి సరిపడే యినాం దొర్కినట్లు నాదిల్ పొంగింది. ఇంగ నేను గుండె మీద బండరాయి బెట్టుకుని ఆడికెల్లి జల్దిజల్ది రిక్షా తొక్కుకుంట ఎల్లిపోయిన' అన్నాడు.

ఇది విని అరుణ అవాక్కయింది. ఆ రిక్షా రహీంపై ఆమెకు ఎక్కడ లేని అభిమానం, గౌరవం పొంగుకొచ్చినవి. గమ్యస్థానం రాగానే వో వందరూపాయల నోటు బలవంతంగా రహీం చేతిలో పెట్టి దిగి పోయింది.

ఆఫీసులో కూర్చున్నదే తప్ప మనస్సంతా రహీం కథలో లీనమై సుళ్లు తిరుగుతూవుంది. 'నిజమే! రహీం చెప్పింది. నేను మానవ హృదయాలను చదువలేదు. ఆ లోతుల్లో ప్రవేశించి తలమునకలు కాలేదు. పైపై అంచులు స్పృశిస్తే ఏం లభిస్తుంది? పైకి తేలే నాచు తప్ప.

ఇంత వరకు నేనేదో పెద్ద రచయిత్రిని అంటూ గొప్పగా ఫీలయ్యేదాన్ని. మానవుణ్ణి చదవందే. అనేక కోణాలనుండి క్షుణ్ణంగా పరిశీలించందే వివిధ పాత్రలను గూర్చి, వారి మనోభావ ప్రసారాలను గూర్చి ఏం వ్రాస్తాను? నాకు తెలిసిందల్లా పైపై మెరుపులే! అవును! పుస్తకాలు వల్లించి చిలకలా ఆ పాదాలే అప్పగించినట్లు వ్రాస్తున్నానే తప్ప మానవుణ్ణి చదివానా? లేదు. అందుకే ఆయా పాత్రల రసభావ ప్రసార సాంద్రతలు కానీ, వేదనా తరంగపు ఆటోపం కానీ, వీటి అట్టడుగున దాగిన రసవాహిని కానీ, సౌందర్య నిధులు కానీ, నరకయాతనలు కానీ, నాకు తెలియవు. ఈనాడు రహీం నా కళ్లు తెరిపించాడు'

పైకి మొరటుగా కనిపించే ఆ గుండెల్లో ఎన్ని అగ్నిపర్వతాలను దాచుకున్నా ఆ మనస్సు లోతులు దర్శిస్తే ఎంత సౌందర్యం, ఎంత సౌకుమార్యం? అంటూ ఆలోచిస్తూనే దినం గడిపింది. మనసంతా ఆ తియ్యటి తీగెలు అల్లుకున్నాయి.

ఇంటికి వెళ్లి కాఫీ తాగి యింతవరకు వ్రాసిన కథ ఏదో నిర్దాక్షిణ్యంగా చింపి వేసింది. తనకు ఆ రోజు వుదయం తటస్థ పడిన రోహం ఆధారంగా వో కథ అల్లింది. ఆ యధార్థ సంఘటనమే అరుణ చెప్పిన ఈ కథానిక.